నమస్కరించి ఈలోకమునువీడెను. రామారావు భార్యపై పడి ఏడ్చి ఏడ్చి, చేయునదిలేక, శవదహనమునుగావించి వచ్చి భార్యావియోగ దుఃఖమును భరించలేక మతిపోయినవానివలె క్రింద చతికిలబడెను. అతనికి, తానీప్రపంచమున నెవ్వరికొరకు బ్రతుకవలెనో తెలియలేదు, తండ్రి లేదు, తల్లిలేదు, భార్యారత్నమగు సుశీలకూడ ఈలోకమువీడెను. నా యన్నవారెవ్వరును లేరు. సుశీలలేకుండ జీవితమును గడపుట కడు దుర్లభముగతోచెను. పట్టలేనిదుఃఖమున తన స్థానమునుండిలేచి, తలుపులనన్నిటినిమూసి, ఒక దూలమునకు త్రాటినిబిగించి ఉరితీసికొని చనిపోయెను. మరునాటి యుదయమున పోలీసు వారువచ్చి ఉతకలెత్తుసరికి రామారావు శవము త్రాటికి వ్రేలాడుచుండెను.

రామారావుభార్య బ్రతికి యున్నంతవరకు పలువిధముల బాధపెట్టెను. ఆమె చనిపోయిన తరువాత తన అంతరంగిక ప్రేమను బయల్పరచెను. తనసంపాదన గాని, ఇందుమతి సౌందర్యము గాని ఆతని మరణసమయమున జ్ఞప్తికి రాలేదు. అవగా నాతడన్నిటికంటె తనభార్యనే మిక్కుటముగ మనస్సునందు ప్రేమించెను. చివరకు సుశీల స్థితి పరికించి మిక్కిలి జాలిపడెను. ఏమి లాభము ? తన క్రౌర్యమునకు పరిపరి విధముల దుఃఖించి, తానుచేసిన తప్పుల గ్రహించి భార్య యందలి ప్రేమను పట్టజాలక ఆత్మహత్య గావించుకొనెను.

# రాజ్యలక్ష్మి

జనస్వామి కోదండరామశాస్త్రిగారు.

రాజ్యానికి సుమారు పదునారు సంవత్సరములుంటవి నవయవ్వనంలోయున్నవి. పురుషులను జూచునపుడు కలతచెందేది. నిమ్మపండువంటి శరీరచ్ఛాయ, చక్కని నుదురు, చిరునవ్వు తాండవమాడే పెదవులు, త్రాచుపాములాంటి వాల్జడ, తేజోవంతములైన నేత్రములు, చెవులకు లోలకులు, కాళ్లకు పట్టీలు, కాళ్లకు కలకత్తా సేండిల్సు, కళ్లకు చలువద్దాలు—యివన్నీచూస్తే ఇంద్రునిభార్య శచీదేవి తలుపుకొస్తుంది. పెండ్లి కబుర్లు కులాసాగా వినేది. ఎక్కడలేని నవనాగరికత మూర్తీభవించింది రాజ్యానికి. కొంచెంసేపు మిస్. సులోచన పద్ధతి, కొంచెంసేపు సరోజినీ బాయి పద్ధతిని, అవలంభించేది. ఆమెముఖపద్మము చంద్రబింబమువలె మెరయుచు స్త్రీలకుండ వలసిన గంభీరత్వము తాండవమాడుచు గన్పట్టుచుండెను. హాస్యరసపత్రికలంటే ఆమెకు సంతోషం. అవి ప్రక్కనుంచే నిద్రకూడా అవసరం లేదు. ఎప్పుడూ ఆలోచనాసముద్రంలో మునిగి తేలేది. సంగీతమంటే ఆమెకు చాలాఅభిమానం. ఎప్పుడూ దానినిగురించి ఆలోచించడం, తత్సంబంధములైన పుస్తకములను చదువుతూండేది.

తాండవం రాజ్యానికి మేనత్తకొడుకవుతాడు. అతను రాజ్యంగారి ఇంటిదగ్గరేయుండి కాలేజీలో బి. ఏ. చదువుతున్నాడు. బాగా పసిమికాకపోయినా చామనఛాయగల దేహము, లోతుగల కండ్లు, నవ్వులొలుకుతున్న విశాలమైన నేత్రములు, గుండ్రనిముఖము, అతని అందాన్ని చాటుతున్నవి. అయస్కాంతము ఇనుమును ఆకర్షించునట్లు తాండవం హృదయాన్ని ఆకర్షించేది రాజ్యం. అతడు ఆమెను జూడగానే దుఃఖమునకు స్వస్తిచెప్పి సంతోషమునకు స్వాగతమిచ్చేవాడు. వారిరువురి ప్రేమను అడ్డుపరచేవాళ్లు దుష్టులు. ప్రతిరోజూ సాయంత్రం సమయమున బీచికి షికారుకెళ్లేవారు. ప్రేమబీజములు వారిరువురి

హృదయాల్లో నాటుకొన్నయి. అట్టిబీజములను పెల్లగించేవారెవరు ?

రాజ్యానికి ఆమెతల్లి దండ్రులు సంబంధాలు కుదర్చటం మొదలెట్టారు ఒకసంబంధంకుదిర్చి లగ్నంపెట్టుకొచ్చారు. "రాజ్యం! పిల్లవాడు యం. ఏ. చదువుతున్నాడు నెక్ష్టు యియ్యర్ మండలాధికారి పరీక్షకు (ఐ. సి. యస్.) లండను వెళతాడట. యాభై వేల రూపాయల ఆస్తి వున్నదట. 18 తారీకున వివాహం "అని అన్నాడు రాజ్యం తండ్రి రాజ్యానికి నెత్తిమీద పిడుగుపడినట్లైనది. ఆమె హృదయంలో రైలు పరిగెత్తినట్లయింది. మనస్సులో మనస్సులేదు. 18వ తారీకుయింకా పది దినాలుంది. రాజ్యం వెంటనే ఒకవుత్తరం వ్రాసి దాసీదానికి యిచ్చి కాలేజీకి వెళ్లి తాండవానికిచ్చి రమ్మంది.

తాండవం కాలేజీలో వెయిటింగురూములో కూర్చున్నాడు. దాసీ ఒకవుత్తరం అందిచ్చింది.

My Dear Thandanam,

అభాగ్యమువలన నీవు నామూలంగా ఎన్నో కష్టాలు అనుభవింపవలసియున్నావు. నావివాహము దగ్గరకొచ్చినది. మనకిట్టి ఎడబాటు కల్గబోవుచున్నదని విచారించవద్దు. నిన్నుతప్ప నేనెవరిని వివాహమాడను. ఒకరోజున కొన్నిపక్షులు ఒక చెట్టుమీద నివసించును. రెండవరోజుకూడా ఆ పక్షులు ఆచెట్టుమీదేనివసించునని చెప్పగలమా? అట్లే రోజులెప్పుడూ ఒకవిధంగా యుండవు. యీవుత్తరము జూచినవెంటనే రావలెను.

ఇట్లు నీప్రియసఖి రాజ్యలక్ష్మి

ఈవుత్తరాన్నిజూచి యిలా విచారపడ్డాడు. "కామవికారము మిగుల అసాధ్యమైనది. అది గలిగిన పిశాచమువలె ఏపనీ చేయనివ్వదు. నా కర్మఫలమే నాయిడుములకు గారణము. నా ఆశాలత యీరోజుతో తెంపవలసిన దేనా" ఎంతవిచారపడినా లాభములేదని తాండవం ఇంటికొచ్చాడు.

ఉదయం 7 గంటలయింది. రాజ్యం; తాండవం; ఇంట్లోలేరు. రాజ్యం తండ్రి ప్రతి పట్టణమునకు తంతివార్తలిచ్చాడు లాభం లేకపోయింది. నాల్గుదినాలు గడిచాయి. రాజ్యంతండ్రి వరండాలో తమలపాకులు నవుల్తూ కూర్చున్నాడు.

పోష్టుజవాను మీరేకాదండీ పి. గోపాలరావుగారు అని ఒక కవరు చేతికిచ్చాడు. అది విప్పిజూచాడు గోపాలరావు.

My Dear father కలకత్తా.

తండ్రి నమస్కారములు,

నీవు కుదిర్చిన సంబంధం నాకు యిష్టములేకపోవుటవల్ల మన తాండవాన్ని వివాహం జేసుకున్నాను. నావిషయమై చింతపడ నవసరంలేదు.

ఇట్లు, రాజ్యలక్ష్మి.

ఈవుత్తరంజూచి తనభార్యా కందిచ్చాడు. ఆమెకూడా చదువుకొంది. లగ్నంరోజు 18 తారీకొచ్చింది. పెళ్ళివారు బేండు మేళాల్తో, సన్నాయి మేళాల్తో, పెద్ద ముస్తాబుతో వచ్చారు. గోపాలరావు రాజ్యం వ్రాసిన వుత్తరం పెళ్ళివారికి చూపించాడు. "నీపిల్ల నీస్వాధీనంలో లేనప్పుడు మాకెందుకిచ్చా వయ్యా" అని పోట్లాడారు పెళ్ళివారు. వచ్చినదారినే పడ్డారు. పిల్లకు యిష్టంలేని సంబంధం కుదిరిస్తే యిదేతిప్పలు.

తాండవం, పడుకున్నాడు మంచం మీద రాజ్యం తమలపాకులకు సున్నం రాస్తోంది.

"రాజ్యం ? నీకు కుదిర్చిన పెళ్ళికొడుకు ఏమయ్యాడో?

"ఏమయ్యాడా? దేవుడో" అంటూ దారిపట్టాడు "నీప్రేమకు నేను మెచ్చుకున్నా. నేను ఎన్నడూ నన్ను పెండ్లాడతా వని నేననుకోలేదు. నేను నిరుపేద. నీవు లక్షాధికారి పుత్రికవు.

"ప్రేమకు భాగ్యం, పేదరికం, కులం, తో పనిలేదు. రాజపుత్రికయగు సావిత్రి నిరుపేదయగు సత్యవంతుని పెండ్లాడలేదా? ధనవంతుని కుమార్తెయగు తిరుమలదేవి గోపాచార్యులను పెండ్లాడలేదా? "అట్లు వారు పెండ్లాడి కష్టములు పొందియుండలేదా?